సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం। 12। జులై। 2025



గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు

జిల్లాలో గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశించారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు ముమ్మరం చేయాలని తెలిపారు. - 8లో



వాటా కోసం.. తమ్ముళ్ల కుమ్ములాట

టెండర్ ద్వారా పనులు దక్కించుకున్న సంస్థకు ఖనిజం సరఫరా చేసే విషయంలో వాటా కోసం తమ్ముళ్ల మధ్య కుమ్ములాట మొదలైంది. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
38.6 /28.2

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 28.2 - 38.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 23.11 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రైలు గడువు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తిరుపతి-చర్లపల్లి-తిరుపతి మధ్య నడుస్తున్న రైలును ఆగస్టు 30వ తేదీ వరకు పొడిగించినట్లు రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. (07011) చర్లపల్లి-తిరుపతి మధ్య ప్రతి శుక్ర, ఆదివారాల్లో.. (07018) తిరుపతి-చర్లపల్లి మధ్య ప్రతి సోమ, శనివారాల్లో నడుస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంటర్ ఎస్సీ విద్యార్థులకు తల్లికి వందనం

కడప రూరల్ : ఇంటర్మీడియేట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్సీ వర్గాలకు చెందిన విద్యార్థుల ఖాతాలకు తల్లికి వందనం నిధులు మంజూరవుతాయని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి కె.సరస్వతి తెలిపారు. జిల్లాలో 1,896 మంది ఇంటర్మీడియేట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఎస్సీ విద్యార్థుల బ్యాంకు ఖాతాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్సీ విద్యార్థులు వెంటనే సమీపంలోని పోస్టాఫీసులో ఖాతానుతెరిచి మీ ఆధార్ నెంబరుకు, ఎన్‌పీసీఐ పోర్టల్‌కు లింక్ చేసుకోవాలన్నారు. ఒక వేళ విద్యార్థికి ఇదివరకే బ్యాంకు అకౌంటు ఉన్నట్లయితే ఆ అకౌంటుకు ఎన్‌పీసీఐ లింక్ చేయించాలని తెలిపారు. మీ ఖాతాకు ఎన్‌పీసీఐ లింకు అవడం వల్ల తల్లికి వందనం పథకం డబ్బులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జమ అవుతాయని తెలిపారు.

ఫ్రైడే డ్రైడేతో ఆరోగ్యకర వాతావరణం



బుడ్డాయపల్లెలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమ లక్ష్యాలను వివరిస్తున్న మనోరమ

కడప రూరల్ : ఫ్రైడే డ్రైడే కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించడం వల్ల ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుందని జిల్లా మలేరియా అధికారి మనోరమ తెలిపారు. శుక్రవారం స్థానిక బుడ్డాయపల్లెలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. వారానికి ఒకసారి ఇళ్లల్లోని తొట్లు, కుండలు, బానలు, కూలర్లు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. డెంగీ, మలేరియా జ్వరాలకు సంబంధించిన రక్త పరీక్షలు రిమ్స్, మీ సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించడం వల్ల ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొనడంతో మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మిరెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక

రాజంపేట : జాతీయస్థాయి క్రీడలకు కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు ఎంపికయ్యారని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మురగేశన్ శుక్రవారం తెలిపారు. కోచ్ రాహుల్ కుమార్, సహాయకోచ్ కుమారజరపాలా వీరికి శిక్షణ ఇచ్చారన్నారు.ఎంపికైన వారిలో మోక్షిత్(చెస్), హర్ష(టేక్వాండో), కార్తీక్, మహేశ్ (కబడ్డీ), ఉదయశంకర (డిస్కస్‌త్రో) ఉన్నారని చెప్పారు. జిల్లాస్థాయి క్రీడలకు అండర్-14 విభాగంలో నాగలక్ష్మీప్రియ, హరిత, అండర్-17లో హర్షిత, రిషి, గాయత్రి, అండర్ -19లో మోహనావైష్ణవి, యశస్విని ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ మురగేశన్ అభినందించారు.

రైళ్లలో ఆకస్మిక తనిఖీలు

రాజంపేట : జిల్లాలో నడిచే పలు రైళ్లలో శుక్రవారం పోలీసులు, రైల్వేపోలీసులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు తనిఖీలు జరిగాయి. చెన్నై-ముంబై మధ్య నడిచే సూపర్‌ఫాస్ట్ రైళ్ల బోగీలను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి,మత్తు పదార్థాల నిర్మూలన, అక్రమరవాణా అరికట్టేందుకు తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్‌పై సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1972కు, 112కు ఫోన్ చేయాలని పోలీసులు తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష

రాయచోటి జగదాంబసెంటర్ : జిల్లాలోని మదనపల్లె మండలం వలసపల్లి గ్రామం, రాజంపేట మండలం నరమరాజుపల్లి గ్రామాల్లో ఉన్న శ్రీ జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశం కోసం డిసెంబర్ 13వ తేదీన పరీక్ష నిర్వహించనున్నారు. ఈవిషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన 2025-26 విద్యా సంవత్సరం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్యూ ఆర్..
సమస్యలు పరార్



ప్రయాణికుల సేవలో ఆర్టీసీ

కడప రీజియన్‌లో క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసిన బస్సుల వివరాలు	
అమరావతి	04
ఇంద్ర	11
స్టార్‌లైనర్	04
సూపర్‌లగ్జరీ	103
అల్ట్రా డీలక్స్	30
ఎక్స్‌ప్రెస్	113

కడప కోటిరెడ్డిసర్కిల్ : సురక్షిత ప్రయాణానికి మొదట గుర్తుకు వచ్చేది ఆర్టీసీ బస్సులే. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులతో పాటు ప్రజలు నిత్యం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. బస్సుల్లో ప్రయాణికులకు అందుతున్న సేవలు, బస్టాండ్లలో మౌలిక సదుపాయాలు సమగ్రంగా తెలుసుకునేందుకు ఆర్టీసీ ×నో ప్యారామీటర్ ఇండికేటర్స్₹ (కేపీఐ) అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రయాణికులు ఆర్టీసీలో ఏవైనా సమస్యలు, సదుపాయాలపై తమ అభిప్రాయాన్ని క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయవచ్చు. పల్లె వెలుగు బస్సుల్లో మినహా మిగిలిన దూర ప్రాంత సర్వీసులైన ఎక్స్‌ప్రెస్, అల్ట్రాడీలక్స్, సూపర్‌లగ్జరీ, ఇంద్ర, అమరావతి, ఓల్వో వంటి బస్సుల్లో డ్రైవరు సీటు వెనుక బాగాన క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. ప్రయాణికులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే బస్సు వేగం, డ్రైవరు, కండక్టర్ ప్రవర్తన, బస్సుల శుభ్రత, సమయానికి అనుకూలంగా రాకపోకలు వంటి ప్రశ్నలు అందులో ఉంటాయి. దాన్ని స్కాన్ చేసిన తర్వాత ప్రయాణికులు తమకు నచ్చిన జవాబు తెలియజేయవచ్చు. అన్ని బస్టాండ్లలోని ప్లాట్‌ఫారం, విచారణ కేంద్రం వద్ద కూడా క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలోని కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల డిపోల్లో దీనిని అందుబాటులోకి తెచ్చారు.

ఇలా స్కాన్ చేయాలి

ప్రయాణికులు తమ మొబైల్‌లో గుగూల్‌లో ఉండే కెమెరా ద్వారా డ్రైవర్ సీటు వెనుక ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ప్రశ్నలు వస్తాయి. వాటిని నింపి సేవ్ చేయాలి. నేరుగా ఆర్టీసీ సంస్థకు ఆ సమాచారం చేరుతుంది.

గతంలో ఇలా..

గతంలో ప్రయాణికులు తమకు ఎదురైన ఇబ్బందులు తెలిపేందుకు ఆర్టీసీ బస్సు ప్రారంభంలో కాల్ సెంటర్ నంబరు 149ను ఏర్పాటు చేశారు. ఏక కాలంలో ఎక్కువ మంది వినియోగించడంతో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సంస్థ తమ సేవలను మరింత సులభతరం చేసేందుకు క్యూఆర్ కోడ్ పద్ధతిని ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఇది ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా మారింది.

ప్రయాణికులు స్పందన తెలియజేయవచ్చు



ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నవారు బస్సు సమయానికి బయలుదేరుతుందా లేక లేటుగా బయలుదేరుతుందా? సమయానికి గమ్య స్థానానికి చేరుతుందా? బస్సు శుభ్రంగా ఉందా? లేదా.. డ్రైవర్, కండక్టర్ ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తున్నారా? అనే విషయాలను తెలియజేయవచ్చు. ప్రయాణికుల స్పందన నేరుగా సంస్థ అధికారులకు చేరుతుంది. దీంతో సత్వరమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

- పొలిమేర గోపాల్‌రెడ్డి, ఆర్ఎం, ఏపీఎస్ ఆర్టీసీ, కడప

రికార్డుల కోసమే ప్రభుత్వ కార్యక్రమాలు

- వాటివల్ల ప్రజలకు ఒనగూరే ప్రయోజనం శూన్యం
- మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం గిన్నిస్ బుక్ రికార్డుల కోసమే ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తోందని, వాటివల్ల ప్రజలకు ఒనగూరే ప్రయోజనం శూన్యమని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా విమర్శించారు. కడపలో శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గురుపౌర్ణమి నాడు సత్యసాయి జిల్లా, పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు జిల్లా పరిషత్ పాఠశాలలో సీఎం చంద్రబాబు పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించి పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసిన పాఠశాలలో ఈ సమావేశం నిర్వహించే నైతిక అర్హత వారికి లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 60వేల పాఠశాలల్లో 2.20కోట్లమంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారని ఘనంగా చెప్పుకుంటున్నారన్నారు.ఇటీవల వైజాగ్‌లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం కూడా గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కిందన్నారు. ఈ ప్రభుత్వం ఏం చేసినా రికార్డుల కోసమే తప్ప ప్రజల కోసం కాదన్నారు. జూన్ 12న 'తల్లికి వందనం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ అమ్మ ఒడి మార్గదర్శకాల ప్రకారమే ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పిన సీఎం చంద్రబాబు, కొద్ది రోజులకే మాటమార్చి నిన్న సత్యసాయి జిల్లా కొత్త చెరువు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో లోకేష్ ఆలోచనల నుంచి 'తల్లికి వందనం' పథకం ఆవిర్భవించిందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. దివంగత ఎన్‌టీఆర్ పేరు చెబితే రూ.2 కిలో బియ్యం, మద్యపాన నిషేధం వంటి పథకాలు గుర్తుకు వస్తాయని, వైఎస్సార్ పేరు చెబితే ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108,104, జలయజ్ఞం, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు,వైఎస్ జగన్ పేరు చెబితే అమ్మ ఒడి, నాడు-నేడు వంటివి గుర్తుకు వస్తాయన్నారు. అయితే చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చే పథకం ఒక్కటి కూడా లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో 4.50లక్షల అడ్మిషన్లు తగ్గాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యూనిఫారం, స్కూల్ బ్యాగ్, పుస్తకాలు, షూ, టై, బెల్ట్ వంటివి కిట్‌గా అందించారని, కూటమి ప్రభుత్వంలో మంత్రి లోకేష్ అసెంబ్లీలో ప్రదర్శించిన స్కూల్ బ్యాగ్‌లు నెల తిరక్కుండానే చిరిగిపోతున్నాయని వీడియోలు చూపించారు.రేషనలైజేషన్ పేరుతో వేల సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలను మూయించిన ఘనత బాబుదేనన్నారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేంత వర కువైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు.

వైఎస్ జగన్‌ను అంతం చేసే కుట్ర: రెడ్యం

కూటమి ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అంతం చేసే కుట్ర జరుగుతోందని ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆరోపించారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనమన్నారు. జెడ్‌ప్లస్ కేటగిరి భద్రత ఉన్న ఆయనకు భద్రత కల్పించకుండా ప్రజలను అడ్డుకునేందుకు వేలమంది పోలీసులను ఉపయోగించారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, కరువు కవల పిల్లలని...జిల్లాలో మహానాడు నిర్వహించినప్పటి నుంచి వర్షాలు లేక రైతులు విలవిల్లాడుతున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బీహెచ్ ఇలియాస్, దాసరి శివప్రసాద్, షఫీ, డిష్ జిలాన్, అక్బర్, అజ్మతుల్లా, అహ్మద్ పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన కుటుంబం శ్రేయస్కరం

కడప రూరల్ : ఆరోగ్యకరమైన కుటుంబం సమాజానికి శ్రేయస్కరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఆ శాఖ కార్యాలయం ప్రాంగణం నుంచి ర్యాలీని ప్రారంభించారు. ప్రణాళిక బద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం అనే నినాదంతో ఐటీఐ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ బాల్య వివాహాల వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులు, మాతా శిశు మరణాలు, లింగ నిష్పత్తులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, డీపీఎంఓ డాక్టర్ శోభభూషణ్, డీఎల్‌ఏటీఓ డాక్టర్ రవి, ఎస్ఎంఓ డాక్టర్ వెంకటచంద్రారెడ్డి, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్, అర్బన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉబెదుల్లా, డెమో భారతి, ఎస్ఓ రమేష్‌రెడ్డి, ఏఎస్ఎం, ఆశాలు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా కడపలోని మహాత్మాగాంధీ కూడలి వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

కమనీయం..సౌమ్యనాథుడి కల్యాణం



కల్యాణంలో మాంగల్యం చూపుతున్న ఆగమశాస్త్ర పండితులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

మారుమోగిన హరినామస్మరణ

నందలూరు : సౌమ్యనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజు శుక్రవారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పుష్పాలతో కల్యా వేదికను అలంకరించారు. పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, సునీల్‌కుమార్, సాయిస్వామిలు శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను ముస్తాబు చేసి మేళతాళాల మధ్య కల్యాణ వేదికపై కొలువుదీర్చారు.అనంతరం కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. వేదపండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలు క్రతువులను నిర్వహించారు.

భక్తుల హరి నామస్మరణలతో ఆలయం భక్తిపారవశ్యంతో నిండిపోయింది. కల్యాణోత్సవం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామిని ఆలయం చుట్టూ పల్లకీలో ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గజవాహనంపై స్వామివారు మాడవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కాయ కర్పూరం సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. శనివారం ఉదయం రథోత్సవం నిర్వహించేందుకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

అన్నదానం : కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు సోమలరాజు చంద్రశేఖర్‌రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.కల్యాణం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు వేపగుంట శ్యామ్రాజ్ ఆధ్వర్యంలో స్కౌట్ సభ్యులు భక్తులకు సేవలు అందించారు.

ఆదాయానికి ఆయువు పట్టు!



- లాభాలు కురిపిస్తున్న పట్టుపురుగుల పెంపకం
- జిల్లాలో మల్బరీ సాగు సీజన్ ఆరంభం
- ఈ ఏడాది ఖరీఫ్ లక్ష్యం 400 ఎకరాలు
- క్లస్టర్ సాగు విధానంలో సాగు లక్ష్యంగా అడుగులు
- సిల్క్ సమగ్ర-2 పథకంలో లబ్ధిదారులకు సబ్సిడీ



వీఎన్‌పల్లి మండలం కీర్తిపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఊటకూరులో సాగులో ఉన్న నర్సరీ

కడప అగ్రికల్చర్ : మల్బరీ సాగుకు మంచి రోజులొస్తున్నాయని... లాభాల 'పట్టు'ను వదలొద్దని అధికారులు రైతన్నను ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో పట్టు పరిశ్రమ విస్తరణకు 'పట్టు'బిగిస్తున్నారు. ఇందులో భాగంగా సాగును ప్రోత్సహిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో రైతన్నలు సైతం పట్టు సాగుకు ఆసక్తిని చూపుతున్నారు.

మల్బరీ మొక్కలను ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు నర్సరీ కేంద్రాలలో సాగు చేస్తున్నారు. ఇందులో కడప నగర శివార్లలోని ఊటకూరు కేంద్రం ఒకటి కాగా మరోకటి మైదుకూరు మండలం వనిపెంట పట్టు పరిశ్రమలశాఖ క్షేత్రంలో మల్బరీ నర్సరీ సాగును చేపట్టనున్నారు. ఈ నర్సరీల ద్వారా మొక్కలు కావాల్సిన రైతులకు ఒక్కో మొక్కను రెండు రూపాయలతో అందించనున్నారు. జిల్లాలో 2025-26 సంవత్సరానికి 400 ఎకరాల మల్బరీ సాగు లక్ష్యంగా ప్రభుత్వం కేటాయించింది. రైతుల మల్బరీ సాగుకు అవసరమైన మొక్కలను ఈ రెండు నర్సరీల ద్వారా అందజేయనున్నారు. ఈ ఏడాది నూతనంగా క్లస్టర్ విధానంలో సాగు లక్ష్యంగా అడుగులు చేయనున్నారు. దీంతో రైతులకు ఖర్చులు తగ్గి దిగుబడి పెరగడంతో పాటు అధికారులు పర్యవేక్షణ పెరగనుంది.


నాలుగు సాంకేతిక కేంద్రాలుగా ...

జిల్లాలోని కడప, బద్వేల్, కమలాపురం, పులివెందులను నాలుగు సాంకేతిక కేంద్రాలుగా విభజించి సాగును కేటాయించారు. ఇందులో కడప సాంకేతిక కేంద్రం పరిధిలో 40 ఎకరాలు, బద్వేల్ సాంకేతిక కేంద్రం పరిధిలో 60 ఎకరాలు, కమలాపురం సాంకేతిక కేంద్రం పరిధిలో40 ఎకరాలు, పులివెందుల సాంకేతిక కేంద్రం పరిధిలో 60 ఎకరాల సాగు లక్ష్యంగా ఏర్పాటు చేశారు. ఇప్పటికే పులివెందుల, ఖాజీపేట, మైదుకూరులతోపాటు పలు ప్రాంతాల్లో సాగు ప్రారంభమయింది.

ఎవరు అర్హులంటే...

జిల్లాలో మల్బరీ సాగుకు సంబంధించి 2.5 ఎకరా మల్బరీని సాగు చేస్తే ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. ఒక రైతు ఒక యూనిట్‌కు ఏర్పాటు చేసుకుంటే ఆ రైతుకు షెడ్డు, ప్లాంటేషన్, పరికరాలు, మందులు అన్ని కలిసి ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. ఈ యూనిట్ ఏర్పాటు కోసం ప్రభుత్వం రైతుకు రూ. 5,60,000 ప్రభుత్వం ఇస్తుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం సబ్సిడీ అంటే రూ. 5,04,000 సబ్సిడీ పోగా మిగతా డబ్బులు రైతులు భరించాల్సి ఉంటుంది. అలాగే జనరల్ రైతులకు 75 శాతం సబ్సిడీ ఇస్తుంది. అంటే రూ. 5,60,000గాను రూ. 4,20, 000 సబ్సిడీ వస్తుంది.

ఈ ఏడాది లక్ష్యం 400 ఎకరాలు...



జిల్లాలో ఈ ఎడాది 400 ఎకరాల మల్బరీ సాగును లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మల్బరీ సాగు కోసం జిల్లాలో కడప ఊటకూరుతోపాటు వనిపెంట కేవీకేలో మల్బరీ నర్సరీని ఏర్పాటు చేస్తున్నాం. మల్బరీ మొక్కలు కావాల్సిన రైతులు ఆ రెండు చోట్లకు వెళ్లి తెచ్చుకోవచ్చు. ఒక మొక్కను రూ. 2 చొప్పున రైతులకు అందిస్తాం. ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ఈ ఏడాది సాగు ఆశాజనకంగా ఉండనుంది.

- అన్నపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి.

పీజీ పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైవీయూ రిజిస్ట్రార్ పద్మ, సీఈ కేఎస్వీ కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం క్యాంపస్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల అనుబంధ పీజీ కళాశాలల రెండో సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు పరీక్షలు శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ , కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావుతో కలసి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వైవీయూపీజీ కళాశాల కేంద్రాన్ని వారు పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 653 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 21 మంది గైర్హాజరైనట్లు వారు తెలిపారు. కడప ఎస్వీ పీజీ కళాశాలలో, ప్రొద్దుటూరులోని ఎస్వీఎస్ఆర్ పీజీ కళాశాలలో పరీక్షలు జరుగుతున్నాయని వివరించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన క్రిస్టఫర్

అట్లూరు : మండలంలోని కడప–బద్వేల్ రహదారిపై రెడ్డిపల్లె సమీపాన ద్విచక్ర వాహనం అదుపుతప్పి శుక్రవారం ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. బద్వేల్ మండలం గుంతపల్లెకు చెందిన పడిగె క్రిస్టఫర్ తన ద్విచక్ర వాహనంపై సిద్ధవటం మండలం మాచుపల్లెకు వెళ్లి తిరిగి వస్తున్నారు. అట్లూరు మండలం రెడ్డిపల్లె సమీపాన కడప–బద్వేల్ రహదారిపై వేప చెట్టును ఢీకొని కింద పడ్డారు. తీవ్ర గాయాలైన క్రిస్టఫర్‌ను 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

రస్తా స్థలం ఆక్రమణయత్నం



ఆక్రమణకు యత్నించిన స్థలం ఇదే!

చింతకొమ్మదిన్నె : కడప నగరంలోకి విలీనమైన చిన్నముసలిరెడ్డిపల్లె దారిలో కొందరు రస్తా స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నించగా కార్పొరేషన్ సిబ్బంది అడ్డుకున్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ఈ స్థలంలో ఉన్న చెట్ల వద్ద స్థానిక ప్రజలు పదుల సంఖ్యలో నిత్యం సేద తీరుతుంటారు. విలువైన స్థలంగా మారడంతో చింతకొమ్మదిన్నె మండలానికి చెందిన అధికారపార్టీ నాయకుడి కన్ను పడింది. తన అనుచరులను రంగంలోకి దింపి రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఆక్రమిత స్థలంలో కట్టడాల నిర్మాణం కొరకు అనుమతి ఇవ్వాలంటూ కోరుతున్నట్లు తెలిసింది. విసుగు చెందిన స్థానికులు పదే పదే ఫిర్యాదు చేయడంతో కార్పొరేషన్ సిబ్బంది స్పందించి శుక్రవారం ఆక్రమిత స్థలంలో నిర్మిస్తున్న కట్టడాలను తొలగించారు.

నేడు తెలుగు భాషా పరిరక్షణ సదస్సు

గోపవరం : కర్నూలులో ఈ నెల 12, 13వ తేదీల్లో తెలుగు భాషా పరిరక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ తెలుగు భాషా వికాస ఉద్యమ వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పిలుపునిచ్చారు. మొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కర్నూలు సీ.క్యాంపు టీజీవీ కళా క్షేత్రంలో రెండు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి తెలుగుభాషా పరిరక్షణ సదస్సుకు తెలుగువారంతా హాజరు కావాలని కోరారు. సదస్సులో తెలుగుభాషపై చర్చాగోష్టి జరిపి పలు తీర్మానాలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని హనుమంతరావు తెలిపారు.

వాటా కోసం.. తమ్ముళ్ల కుమ్ములాట

- సీఎండీ గ్రేడ్ ఖనిజం సరఫరాలో బెడిసిన ఒప్పందం
- తమకే 25 శాతం ఇవ్వాలని స్థానిక టీడీపీ నేతల పట్టు



ఖనిజం సరఫరా నిలిచిపోవడంతో ఆగిన లారీలు

ఓబులవారిపల్లె : టెండర్ ద్వారా పనులు దక్కించుకున్న సంస్థకు ఖనిజం సరఫరా చేసే విషయంలో వాటా కోసం తమ్ముళ్ల మధ్య కుమ్ములాట మొదలైంది. 25 శాతం వాటా తమకే ఇవ్వాలంటూ స్థానిక టీడీపీ నాయకులు భీష్మించడంతో వాదోపవాదాలు జరిగాయి. బేరసారాలు బెడిసికొట్టడంతో టెండర్ దక్కించుకున్న కంపెనీ చివరికి సరఫరా నిలిపివేసింది. వివరాల్లోకి వెళ్తే..

మంగంపేట ఏపీఎండీసీ గనుల నుంచి 60 లక్షల మెట్రిక్ టన్నుల ఏపీ ఎండీసీ నుంచి ఖనిజాన్ని కొనేందుకు బల్క్ టెండర్ ద్వారా ఎంప్రదా కంపెనీ దక్కించుకుంది. ఎపీఎండీసీ కంపెనీ ఖనిజాన్ని తరలించాల్సి ఉంది. దీనిపై కూటమి నాయకుల కన్ను పడింది. పెద్ద ఎత్తున తామే ఖనిజం తీయిస్తామని గతంలో ఒప్పందం చేసుకున్నారు. రోజూ దాదాపు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల మేర సరఫరా చేస్తున్నారు. అయితే ఇటీవల స్థానిక టీడీపీ నాయకుడు 25 శాతం ఖనిజం తీసేందుకు తమ యంత్రాలకు అవకాశం ఇవ్వాలని పటుబట్టారు. అంతకుముందు తరలిస్తున్న కూటమి నాయకులు దీనికి ఒప్పుకోకపోగా.. వాగ్వాదాం జరగడంతో వివాదం ముదిరింది. దీంతో దీనిపై శుక్రవారం ఉదయం నుంచి కూటమి నాయకుల మధ్య చర్చలు జరిగాయి. బేరసారాలు కుదరక పోవడంతో చివరకు ఏపీఎండీసీ నుంచి ఎమ్‌ప్రదా కంపెనీకి బెరైటీస్ ఖనిజం సరఫరా నిలిపివేశారు. ఏపీఎండీసీ గనుల నుంచి స్థానిక నిర్వాసిత కుటుంబీకులు, ఇల్లు కోల్పోయిన వారంతా లక్షల రూపాయలు అప్పుచేసి యంత్రాలు కొనుగోలు చేశారు. 51 ఇటాచీలు పెట్టి ఖనిజం తీస్తూ జీవనం సాగిస్తున్నారు. కూటమి నాయకులు తమకే వాటా కావాలనడంతో వీరి మధ్య వివాదం వారి జీవన స్థితిగతులకు అంటకంగా మారింది. కంపెనీకి ఖనిజం రవాణా చేసేలా చూడాలని యంత్రాల యజమానులు కోరుతున్నారు.

ఇంటి తాళాలు పగలగొట్టి నగదు, వెండి చోరీ



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

ఖాజీపేట : ఖాజీపేట పోలీస్ స్టేషన్ సమీపంలోనే శుక్రవారం చోరీ జరిగింది. బాధితుల వివరాల మేరకు.. ఖాజీపేట మహిళా మార్టు ప్రక్కన నివాసముంటున్న పీఎస్.అమితాబ్ గురువారం రాత్రి తన ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం అమితాబ్ ఇంటి ముందు తన ఫొటో స్టూడియో తెరిచేందుకు వచ్చిన సిద్ధిక్ వెనుకభాగం వాకిలి పగిలి ఉడడం గమనించాడు. లోపలికి వెళ్లి పరిశీలించి చోరీ జరిగిన విషయం యజమాని అమితాబ్‌కు సమాచారం ఇచ్చారు. నాలుగు బీరువాలు పగుల కొట్టి దుస్తులు చెల్లా చెదురుగా పడేసినట్లు గమనించిన అమితాబ్ ఖాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూ.20 వేల నగదు, వెండి వస్తువులు దోచుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. బంగారు ఆభరణాలు తమ వెంట తీసుకుని పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పోలీసులు ఎదురుగా మహిళా మార్టు సీసీ కెమేరాలు పరిశీలిస్తున్నారు.

సమగ్ర శిక్ష శాఖలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటిలోని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఫారిన్ సర్వీస్ నిబంధనలు, షరతులపై పలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. సహాయ బాలికా శిష్యు అభివృద్ధి అధికారి(జీసీడీఓ), సహాయ బాలికా శిష్యు అభివృద్ధి అధికారి(జీసీడీఓ), సహాయ బాలికా శిష్యు అభివృద్ధి అధికారి(అసిస్టెంట్ జీసీడీఓ), సహాయ విద్యా సంబంధమైన పర్యవేక్షణ అధికారి (ఉర్దూ) పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోస్టుకు పీజీ డిగ్రీ అర్హత కలిగి, ఐదేళ్ల సర్వీసు కలిగిన స్కూల్ అసిస్టెంట్లు, ఎనిమిదేళ్ల సర్వీసున్న సెకండరీ గ్రేడ్ టీచర్లు దరఖాస్తు చేయాలన్నారు. సహాయ ప్రోగ్రాం ఆఫీసర్(ఏపీఓ) పోస్టులకు మాథ్స్/స్టాటిస్టిక్స్ కంప్యూటర్ సైన్స్, ఎంసీఏలో పీజీ డిగ్రీ అర్హత ఉండాలన్నారు. అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్(ఏఎస్ఓ) పోస్టులకు మాథ్స్/ స్టాటిస్టిక్స్‌లో పీజీ డిగ్రీ, గుర్తింపు పొందిన యూనివర్శిటీలో కంప్యూటర్ డిప్లమో/ డిగ్రీ కలిగి ఉండాలని తెలిపారు. పై అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు జిల్లా ప్రాజెక్టు అధికారికార్యాలయం నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్ : వివిధ కారణాలతో చదువు అర్ధంతరంగా మానేసిన వారికి ఓపెన్ స్కూల్ మళ్లీ చదువుకొనే చక్కటి అవకాశం కల్పిస్తోందని డీఈఓ షేక్ షంషుద్దీన్, ఓపెన్ స్కూల్ జిల్లా కోర్డినేటర్ సాంబశివారెడ్డి అన్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్స్‌కు సంబంధించిన కరపత్రాలను కడప డీఈఓ కార్యాలయంలో డీసీ సాంబశివారెడ్డి, ఏపీసీ నిత్యానందరాజు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేష్‌తో కలిసి శుక్రవారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్ ప్రక్రియలో ఎటువంటి సందేహాలున్నా అభ్యాసకులు సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ ఏడాది కూడా జిల్లాలోని అధ్యయన కేంద్రాల సమన్వయకర్తలు పూర్తి బాధ్యతతో నిర్ణీత గడువులోపు అడ్మిషన్లు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ నిత్యానందరాజు, శివ, తదితరులు పాల్గొన్నారు.

బెయిల్ మంజూరుపై ఎంపీకి కృతజ్ఞతలు

వేంపల్లె : ఈ నెల 7న మైనర్ బాలిక అదృశ్యంపై జరిగిన పోలీస్ స్టేషన్‌ను ముట్టడి కేసులో పలువురికీ బెయిల్ రావడంతో పక్కీరుపల్లె ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సంఘటన జరిగిన అనంతరం పోలీసులు 200 మందిపై కేసులు నమోదు చేశారు. కూటమి ముఖ్య నాయకులను వదిలేసి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. కూలి పనులు చేసి జీవనం సాగించే వారిపై కేసులు పెట్టడంతో మనో వేదనపడ్డారు. కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డికి విషయం తెలుపడంతో ఆయన స్పందించి వ్యయ ప్రయాసలు పడి శుక్రవారం హైకోర్టును ఆశ్రయించారు. తన సొంత డబ్బులతో బెయిల్ మంజూరు చేయించారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులు, యువకులు హర్షం వ్యక్తం చేశారు.

వెనుకబడిన ప్రాంతాలపై నిర్లక్ష్యం వద్దు

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి రాజధాని పేరుతో అభివృద్ధి అంటూ... వెనుక బడిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేయడం తగదని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ అన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర కమిటీ సమావేశం కడప ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో నారాయణ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక చంద్రబాబు రాయలసీమ అభివృద్ధిపై చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. మహానాడు వేదికగా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు.

నెల రోజుల్లో కడప ఉక్కు పరిశ్రమ పనులు జరుగుతాయని చెప్పిన ముఖ్యమంత్రి పట్టించుకోలేదని ఆరోపించారు. రాష్ట్ర సంపాదనంతా రాజధాని పేరుతో ఖర్చుపెడితే మిగతా ప్రాంతాల అభివృద్ధి ఎలా అంటూ ఆయన ప్రశ్నించారు. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగాక రైతులు కష్టాలు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేస్తామని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోరుతూ ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, ఎన్‌వీ.రమణ, మాలకొండయ్య, శివయ్య, సీఆర్వీ ప్రసాద్, గుర్రప్ప, అంజి, రవిశంకర్‌రెడ్డి, జయవర్ధన్, ప్రభాకర్‌రెడ్డి, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ బి–జోన్ స్థాయి సీఐఎస్‌సీఈ జోనల్ బ్యాడ్మింటన్ పోటీలను శుక్రవారం స్థానిక హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ మైదానంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్నాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో అండర్–14, అండర్–17, అండర్–19 వయోపరిమితి గల బాల, బాలికలు పాల్గొని తమ ప్రతిభ ప్రదర్శించారు. అండర్–17 బాలుర డబుల్స్‌లో చిత్తూరు పీపల్ గ్రోవ్ స్కూల్, కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, గుంటూరు లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. అండర్–17లో బాలుర సింగిల్స్‌లో చిత్తూరు పీపల్ గ్రోవ్ స్కూల్, గుంటూరు లిటిల్ ఫ్లవర్ స్కూల్, చిత్తూరు పీపల్ గ్రోవ్ స్కూల్‌లు వరుస మూడు స్థానాల్లో నిలిచాయి.

అండర్–17 బాలికల డబుల్స్‌లో కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, అండర్–14 బాలుర విభాగంలో గుంటూరు లిటిల్ ఫ్లవర్ స్కూల్ విజేతలుగా నిలిచాయి. అండర్–14 బాలికల విభాగంలో కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి జిలానీబాషా, శ్రీనివాసమూర్తి, రహమతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ విచారణకు వచ్చిన వ్యక్తికి అస్వస్థత

బద్వేలు అర్బన్ : బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన నకిలీ పట్టాల కేసులో అనుమానితుడుగా ఉంటూ విచారణకు హాజరయ్యేందుకు వచ్చిన ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం.. బద్వేల్ అర్బన్ స్టేషన్‌లో నమోదైన నకిలీ ఇంటి పట్టాల కేసులో గత పది రోజులుగా అర్బన్ పోలీసులు పలువురు అనుమానితులను విచారిస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని బయనపల్లె గ్రామానికి చెందిన పిల్లి భాస్కర్‌ను రోజూ పిలిచి విచారించి రాత్రికి ఇంటికి పంపిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం విచారణ నిమిత్తం స్టేషన్ వద్దకు వచ్చిన భాస్కర్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పోలీసులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి భాస్కర్‌ను కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గుండెల్లో దడ రావడంతోనే ఆసుపత్రికి తీసుకువచ్చామని, ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని భాస్కర్ కుటుంబ సభ్యులు తెలిపారు.

గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు



నేర సమీక్ష సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న పోలీసు అధికారులు, సిబ్బంది

నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్

కడప అర్బన్ : జిల్లాలో గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ ఆదేశించారు. స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు ముమ్మరం చేయాలని, శివారు ప్రాంతాలు, ఇతర ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్టేషన్ కు వచ్చే మహిళలు, ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. వైన్ షాపుల వద్ద నిబంధలకు విరుద్ధంగా మద్యం తాగితే చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దష్టి పెట్టాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నక్షంచి, కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ విస్తృతంగా నిర్వహించాలని కోరారు. క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.సైబర్ నేరాలు, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దాబాలు, హోటళ్లు, లాడ్జిలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో తనిఖీలు నిర్వహించాలన్నారు. రాత్రి గస్తీ పెంచాలని ఆదేశించారు. అనంతరం ఇటీవల కోర్టులో జీవిత ఖైదు శిక్ష పడేలా కృషిచేసిన సిబ్బందికి నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీలు ఎస్.సుధాకర్, ఇ.బాలస్వామిరెడ్డి, అబ్దుల్‌కరీం, ఎ.వెంకటేశ్వర్లు, పి.భావన, రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్వరరావు, మురళి నాయక్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ద్విచక్ర వాహనాలు



ద్విచక్ర వాహనాలతో పోలీసు సిబ్బంది

కడప అర్బన్ : ట్రాఫిక్ నియంత్రణ కోసం అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన బుల్లెట్, 15 ద్విచక్ర వాహనాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్ శుక్రవాం ప్రారంభించారు. మంగళగిరి నుండి వచ్చిన ఈ వాహనంలో సైరన్, బ్లింకర్స్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, క్రౌడ్ కంట్రోల్ టెక్నాలజీ ఉన్నాయన్నారు. కడపకు ఏడు, ప్రొద్దుటూరుకు నాలుగు, పులివెందులకు రెండు, జమ్మలమడుగు, బద్వేల్, మైదుకూరుకు ఒక వాహనం కేటాయించారు. ఫోర్ వీలర్ వెళ్ళలేని ప్రాంతాలలో టూ వీలర్స్ ఉపయోగిస్తారని, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలనే ఉద్దేశ్యంతో పనిచేస్తారని ఎస్పీ తెలిపారు. న్నా

18న చలో ఢిల్లీ



చలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : కడపలో ఉక్కు పరిశ్రమ హామీ అమలు కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయ ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. పది రోజుల్లో ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభిస్తామని మహానాడులో చంద్రబాబు చెప్పినా, నేటికీ పనులు ప్రారంభం కాలేదనన్నారు. ఈ కార్యక్రమంలో మస్తాన్‌షరీఫ్, ఆదిల్, ఓబుల్‌రెడ్డి, సుధాకర్, నరసింహ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక మద్యం స్వాధీనం



వ్యక్తి అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె రూరల్ : ఎక్సైజ్ బార్డర్ మొబైల్ పెట్రోలింగ్ సిబ్బంది గురువారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో 12.96 లీటర్ల ఎన్‌డీపీఎల్ కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి టూవీలర్ సీజ్ చేసినట్లు సీఐ సత్య శ్రీనివాస్ తెలిపారు. మీడియాతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ... కర్నాటక సరిహద్దు చీకలబైలు చెక్‌పోస్ట్‌కు సమీపంలో బార్డర్ మొబైల్ పెట్రోలింగ్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా, కురబలకోట మండలం తుంగావారిపల్లెకు చెందిన మూలి రమేష్(27), కర్నాటకకు చెందిన బెంగళూరు మాల్ట్ విస్కీ(90ఎం.ఎల్) 96 టెట్రా ప్యాకెట్లు, సుజుకీ ఆక్సెస్ వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతడి నుంచి రూ.3,840 విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకుని, టూవీలర్‌ను సీజ్ చేశామన్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన పెద్దిగాని సోమశేఖర్(28), కర్నాటకకు చెందిన హైవార్డ్స్ ఛీర్స్ విస్కీ(90ఎం.ఎల్) 48 టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. రెండు కేసుల్లోనూ ఇద్దరిని అరెస్ట్‌చేసి ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించామన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలుశిక్ష

మదనపల్లె రూరల్ : పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ చిత్తూరు పోక్సో కోర్టు జడ్జి ఎం.శంకరరావు శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు వన్‌టౌన్ సీఐ ఎరిషావలి తెలిపారు. పట్టణంలోని సుభాష్ రోడ్డుకు చెందిన టి.చంద్రశేఖర్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలికల హైస్కూల్ వద్ద 2017 మార్చి, 3న స్కూల్‌కు వెళ్లే విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో అప్పటి హెచ్ఎం పద్మజ ఫిర్యాదు మేరకు, ఎస్ఐ మనోహర్ పోక్సో కేసు నమోదు చేశారన్నారు. కోర్టు విచారణ అనంతరం శుక్రవారం చిత్తూరు పోక్సో కోర్టులో నిందితుడు చంద్రశేఖర్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ..5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారన్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం



ఒకే వేదికపై సిద్ధేశ్వర, చెన్నకేశవ స్వాముల కల్యాణోత్సవం

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలో శుక్రవారం సిద్ధేశ్వర స్వామి, చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవాలను వేర్వేరుగా వైభవంగా నిర్వహించారు. అన్నమాచార్య ధ్యాన మందిరం ఆవరణలోని కళ్యాణ వేదికపై ముందుగా సిద్ధేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అలంకరించి కొలువుదీర్చారు. ఒకే వేదికపై శివ, కేశవుల కళ్యాణం జరుగుతుండడంతో రాజంపేట పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కళ్యాణోత్సవానికి హాజరైన వారికి టీటీడీ అన్నప్రసాదం పంపిణీ చేసింది. సర్పంచి గౌరీ శంకర్, ఉద్దండం సుబ్రహ్మణ్యం, అదృష్టదీపుడు, టీటీడీ అధికారులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం : బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సిద్ధేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి రథోత్సవం నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జింక

రాయచోటి : రామాపురం మండలం పాలనగారిపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జింక మృతిచెందింది. శుక్రవారం ఉదయం రాయచోటి నుంచి ద్విచక్ర వాహనంలో కొందరు కడపకు వెళ్తున్నారు. పాలన్నగారిపల్లి సమీపంలో చెట్లపొందల నుంచి జింక రోడ్డుమీదకు రావడంతో ఢీకొన్నారు. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులు గాయాలపాల య్యారు. గాయపడిన జింక కూడా మృతి చెందినట్లు అటవీబీట్ అధికారి భరణీధర్ తెలిపారు.